ప్రజాశక్తి
బుధవారం 17 జనవరి 2024
5
కర్నూలు

కర్నూలు మోకాళ్లపై నిలబడి సాష్టాంగ నమస్కారంతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పాలకుల విధానాలతో

కళ తప్పిన సంక్రాంతి

- ఐక్యతతో ఆటల పోటీలు అభినందనీయం - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాలకుల విధానాలతో పండుగలు కళ తప్పుతున్నాయని, ఇలాంటి పరిస్థితిలో అందరూ ఐక్యంగా ఆటలపోటీలు నిర్వహించడం మంచి పరిణామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ అన్నారు. కర్నూలు ఇందిరా గాంధీనగర్‌లో సంక్రాంతి సంబరాలు డివైఎఫ్ఐ ,ఐద్వా,ఎస్ఎఫ్ఐ, పిఎన్ఎం ,కెవిపిఎస్ స్థానిక కమిటీల ఆధ్వర్యంలో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఐద్వా వార్డు కార్యదర్శి ఎం.కుమారీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఏ.గఫూర్ కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో గత 40 సంవత్సరాల నుండి సంతోషంగా అందరూ కలిసిమెలిసి నిర్వహించడం సంతోషమని తెలిపారు. ఈ పండుగ వాతావరణం ఇలాగే కలకాలం కొనసాగాలని అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు శాంతి ఆరోగ్యం ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. సంక్రాంతి అంటే పంటలన్నీ చేతికి వచ్చి ఆనందంగా సంతోషంగా జరుపుకునే పండుగ ఈ సంవత్సరం ఆదాయాలు లేక విపరీతంగా ధరలు పెరగడం, వ్యాపారాలు జరగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల పైన విద్యుత్, ఆర్‌టిసి బస్సు చార్జీల భారం, రకరకాల పన్నుల భారం పెరిగి ఆదాయాలు లేక సంతోషంగా పండుగలు జరుపుకునే పరిస్థితి లేదన్నారు. ఎవరి మొఖంలో సంతోషం, శాంతి వ్యక్తం కావడం లేదని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్ మాట్లాడుతూ ఐక్యత కోసం ఆటలు యువతమైత్రికి బాటలు అనే నినాదంతో అనేక సంవత్సరాల నుండి ఎవరింట్లో వారు కాకుండా అందరూ ఆనందంగా పండుగ చేసుకోవాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆటల పోటీలలో, ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఐద్వా సినియర్ నాయకురాలు టి.అన్నపూర్ణమ్మ, మహిళా మార్ట్ కార్యదర్శి జె.కిరణ్ మయి, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు పి.నోమేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ వి.శంకర్, వార్డు కార్యదర్శి కె.విక్రమ్, కెవిపిఎస్ నగర నాయకులు ఎస్.రోశయ్య, వార్డు నాయకులు అర్.మద్దిలేటి, పి.ఇబ్రహిమ్, ఎ.శ్రీనువాసులు, యు.విజయ్ కుమార్, టి.శ్రీలక్ష్మి, శిరీషా, జాన్సి, రాధిక పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎంఏ.గఫూర్

బహుమతులు అందజేస్తున్న ఎంఏ గఫూర్ , ఇతర నాయకులు

మోకాళ్లపై నిలబడి సాష్టాంగ నమస్కారంతో

అంగన్వాడీల నిరసన

- 36వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడీల సమ్మె ఈ మంగళవారం 36వ రోజు కొనసాగింది. అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి సాష్టాంగ నమస్కారం చేస్తూ వినూత్నంగా మా సమస్యలు పరిష్కరించండి జీతాలు పెంచండి మహాప్రభో అని నిరసన తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్‌లో జరిగిన సమ్మె సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడుతూ 36వ రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. సంక్రాంతి పండగ రోజు కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన రోజు అంగన్వాడీలు ఎండకు నిలబడి సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఆరుసార్లు జరిపిన చర్చలలో కనీస వేతనాల గురించి కానీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు అంశానికి సంబంధించి కానీ ఎలాంటి చర్చలు జరపకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఒకపక్క సమ్మెను అణచివేయడానికి అత్యవసర సర్వీసుల చట్టం కింద అంగన్వాడీలను చేరుస్తూ జిఒ నెంబర్ రెండును తీసుకొని రావడం, బలవంతంగా నోటీసులు ఇండ్ల దగ్గర సెంటర్ల దగ్గర అతికించడం, డ్యూటీలు చేయాలని బెదిరించడం, సూపర్వైజర్ల ద్వారా ఒత్తిడి తీసుకురావడం వైసిపి కార్యకర్తలు ఇండ్ల దగ్గర మహిళలను మీరు డ్యూటీలు చేయాలని ఒత్తిడి చేయడం పట్ల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకొని అంగన్వాడీలతో చర్చలు జరిపి సామరస్యంగా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె కొనసాగితే రాబోయే కాలంలో అంగన్వాడీలు ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధపడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ రామాంజనేయులు, కె రామకృష్ణ, ఎఐటియుసి నాయకులు రహిమాన్, అంగన్వాడీల యూనియన్ నాయకులు చౌడేశ్వరమ్మ, విజయలక్ష్మి, విజయమ్మ, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

పత్తికొండ: అంగనవాడీ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ డిమాండ్ చేశారు. అంగన్వాడి కార్మికుల దీక్షలు 36 రోజుకు చేరుకున్నాయి. కాంతమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులు కనుమ పండగ రోజు కూడా కూడా దీక్షలు కొనసాగిస్తున్నారని ఈ ప్రభుత్వానికి ఏమాత్రం కార్మికులపై కనికరం లేదని విమర్శించారు. సిఐటియు నాయకులు గోపాల్ ,కాశీ విశ్వనాథ్ తుగ్గలి సిపిఎం కార్యదర్శి శ్రీరాములు, మద్దికేర సిఐటియు మండల కార్యదర్శి రాముడు, అంగన్వాడి నాయకురాలు కాంతమ్మ, పద్మజ, షాజహాన్ , లక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన

గూడూరు : అంగన్వాడీల సమ్మె గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో 36వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గూడూరు లో అంగన్వాడీ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు అరుణ, ఇందుమతి మాట్లాడారు. అంగన్వాడీ కార్మికులు అనంతమ్మ, రత్నమ్మ, సుజాత, అనురాధ, మహేశ్వరి, రాజేశ్వరి లు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఖాళీ కడుపుతో క్లాప్ డ్రైవర్ల నిరసన

- 31వ రోజుకు చేరుకున్న సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మునిసిపల్ క్లాప్ డ్రైవర్లు కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ఎదుట ఖాళీ కడుపుతో నిరసన తెలిపారు. మంగళవారం నాటికి 31 రోజులకు చేరింది. సిఐటియు నగర నాయకులు కుమార్ మాట్లాడుతూ సమ్మె మొదలై 31 రోజుల అవుతున్నా ఈ ప్రభుత్వం లో చలనం లేకుండా పోయిందని విమర్శించారు. బాధ్యత కలిగిన మున్సిపల్ కమిషనర్ క్లాప్ డ్రైవర్ల ను జీతాలు అడిగినందుకు ఐఎఎస్ అధికారి అయ్యుండి కూడా బెదిరింపులకు గురి చేశారని, ఇలాంటి చర్యలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. పండుగను సంతోషంతో చేసుకోవాల్సిన మునిసిపల్ క్లాప్ డ్రైవర్లు జీతాలు లేక వాళ్ల కుటుంబాన్ని ,పిల్లలను పండగ రోజు ఖాలి కడుపుతో పండుగను చేసుకోవాల్సిన పరిస్థితి ఈ మున్సిపల్ కమిషనర్, రెడ్డిఏజెన్సీ, వైసిపి ప్రభుత్వం కారణమైందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ తన బాధ్యతలను గుర్తుచేసుకొని కార్మిక చట్టాల ప్రకారం క్లాప్ డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకుండ సమ్మెను విరమించేది లేదని అన్నారు. బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ల నాయకులు షఫీ, రాజేష్ ,బాబ్జి ,వెంకటేష్,క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఖాళీ కడుపుతో నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

శరీన్‌నగర్‌లో సంక్రాంతి సంబరాలు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరులో సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శరీన్ నగర్లో 29 వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 120 మంది మహిళలు పోటీలలో పాల్గొన్నారు. వారిలో ప్రథమ బహుమతి బి.లీలావతికి 32 ఇంచుల ఎల్ఇడిటి వి, ద్వితీయ బహుమతి కె.సుమలత వాషింగ్ మెషిన్, తృతీయ బహుమతి ఎం. రేణుక వాటర్ గ్లీజర్, చతుర్థ బహుమతి జానకి మిక్సి గెలుపొందారు. విజేతలకు బహుమతులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డిరేణుక, కార్పొరేటర్లు దండు లక్ష్మికాంతారెడ్డి, గాజుల శ్వేతా రెడ్డి, మిద్దె చిట్టమ్మ, వైజా అరుణ నారాయణరెడ్డి, నాయకులు కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి, ఎద్దుల శివారెడ్డి భూపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగమద్దిలేటి, తిరుపాలు, హుసేనాలం, హేమలత, నాగరత్నమ్మ, రాజు, పౌలు, సోమేష్, శేఖర్, రత్నం, ప్రభాకర్, గంగా, వీరన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి ఆటలపోటీలు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు మండలం కె. మార్కాపురం గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి.. ముగ్గుల పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతులు పాణ్యం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, తడకనపల్లె సర్పంచ్ షెహరాభి, కె. మార్కాపురం గ్రామ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న గౌరుచరిత

ఉలిందకొండలో : ఉలిందకొండలో ఇవి రమణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటో రివర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఇ వి రమణ బహుమతులు అందించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గొల్ల సాయిలీల గ్రైండర్, రెండో బహుమతి బి మహారాణి లగేజ్ బ్యాగ్, మూడవ బహుమతి బి వనజ మిక్సీ, నాల్గువ బహుమతి ఎం మంజుల డిన్నర్ సెట్, పోటీల్లో పాల్గొన్న అందరికీ కన్సోలేషన్ బహుమతులు యుద్ధం ఫ్యామిలీ ఇవి ఆర్ టీమ్ అండ్ గ్రామ నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఆటో రివర్స్ పోటీల్లో మొదటి బహుమతి మధు సుధాకర్, రెండవ బహుమతి రాము, మూడవ బహుమతి మాసమ్, నాలుగో బహుమతి అంజి గెలుపొందారు. ఆటో రివర్స్ పోటీలను బొగ్గుల భాష ఆర్గనైజింగ్ చేశారు.

కబడ్డి విజేతల టీం తో ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ విద్యాసాగర్

ఐక్యతకు చిహ్నం ఆటలు : ఎంపిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమైక్యత భావానికి ఆటలు చిహ్నంగా నిలుస్తాయని కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ అన్నారు. సంక్రాంతి పాటల పోటీల్లో భాగంగా కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. జిల్లాస్థాయి ఆటల పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి కబడ్డి జట్లు పాల్గొని ఆడడం అభినందనీయమన్నారు. యువత క్రీడల్లో రాణించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించే దిశగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించిందని గుర్తు చేశారు. విజేతలు పంచలింగాల ఎబిఎం-బి జట్టుతో పాటు, రెండు, మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన వర్కూరు, పంచలింగాల ఎబిఎం-ఎ తొలిషాపురం జట్లను ఆమె అభినందించారు. మాజీ వైస్ ఎంపిపి ధర్మవరం వాసు, సర్పంచి విద్యాసాగర్, పలువురు క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని ఆర్‌టిసి బస్టాండు

కుచించుకు పోతున్న సి బెళగల్ బస్టాండ్ ఆవరణ

పెరుగుతున్న వాహనాల రద్దీ - కనీస సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి- సి బెళగల్

కోడుమూరు నియోజవర్గానికి రూ.330 కోట్లు తెచ్చి అనేకం అభివృద్ధి పనులు చేశామని అధికార పార్టీ ఎమ్మెల్యే చెబుతున్నారు. సి బెళగల్ మండలం, బస్టాండునుమాత్రం అభివృద్ధిని గాలికొదిలేశారు. శాశ్వత, తాత్కాలికమైన పనులు మండలంలో ఎక్కడా చేపట్టినట్లు ఆనవాల్లు ఏమాత్రం లేవనే చెప్పాలి. ఇందుకు నిదర్శనంగా ఏళ్లుగా అభివృద్ధికి నోచని సి బెళగల్ బస్టాండ్ నిలుస్తుంది. మండలంలో 18 పంచాయతీలు ఉండగా ప్రతి పల్లె ప్రజలు సి బెళగల్‌కు వస్తుంటారు. ఇంటి అవసరాలు, ఇతర పట్టణ, ప్రయాణ అవసరాలకోసం మండల కేంద్రానికి రావల్సిందే. గత ఏడేళ్లుగా ప్రజల, వాహన రాకపోకలు అధికం కావడంతో బస్టాండ్‌కు ఎమ్మిగనూరు వైపు, కర్నూల్ వైపు వెళ్లే దారులకిరువైపులా వ్యాపార దుకాణాలు అధికంగా వెళాశాయి. ఇక్కడే తోపుడు బండ్లు, పలుకుదొడ్డి, బురాన్‌దొడ్డి, తిమ్మందొడ్డి, గొల్లలదొడ్డి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఆటో స్టాండ్లు, చిరువ్యాపారులు రోడ్లమీదే పెట్టుకోవడం వలన ఆక్రమణలతో బస్టాండ్ ఆవరణం కిలోమీటర్ మేర కుంచించుకు పోయింది. ఉదయం, సాయంత్రం బడి వేళలలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యగాంం మారుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సొంత కార్లతో మండల కార్యాలయాలకు వస్తారు వెళ్తారు.. బస్టాండ్ పురోగతిని గూర్చి రోజూ చూస్తారు. ఏనాడూ కనీసం ప్రస్తావన చేసిన పాపాన లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలానికి అడపాదడప నిధులు వస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు , అధికారులు బస్టాండు విస్తరణ గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండపరిషత్ సమావేశంలో కూడా ప్రస్తావించరు. ఇప్పటికైన రోడ్డుపై ఉన్న సిబెళగల్ బస్టాండు విస్తరణకు, కనీస సౌకర్యాలకు ప్రజాప్రతినిధులు, ఆర్‌టిసి ఇతర అధికారులు చొరవ చూపాలి.

మహిళలకు మరుగుదొడ్లు లేవు:లక్ష్మీ, మారందొడ్డి

సి బెళగల్ బస్టాండులో మహిళలకు, కిషోర బాలికలకు ప్రధానంగా మరుగుదొడ్లు లేవు. దీంతో చాలా ఇబ్బందికరంగా ఉంది. అటు అధికారులు, ఇటు నాయకులు ఇదే బస్టాండు ఇరుకుగా ఉందని తెలిసికూడా సభలు పెడుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.

ఆటోలు నిలుపడానికి స్థలం లేదు: నతానియేలు ఆటో డ్రైవర్

ప్రజలు సిబెళగల్ కు రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ఆటోలను ఆశ్రస్తున్నారు. వారి సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణంలో ఆటోలు నిలుపుకోవడానికి ఆటోస్టాండు స్థలం లేదు. రద్దీ పెరుగుతున్న కారణంగా బస్టాండుకు దూరంగా ఆటోస్టాండ్లు ఉండటంతో ప్రయాణికులు, ఇతర లగేజీ కలిగిన వారు అవస్థలుపడుతున్నారు.

అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వీడాలి : రాఘవరెడ్డి, సి బెళగల్

అభివృద్ధిలో పుంజుకుంటున్న సి బెళగల్ బస్టాండులో ట్రాఫిక్ సమస్య, వాహనాల రద్దీ, ప్రయాణికుల సౌకర్యాలు, ఇతర మరుగుదొడ్లు, తాగునీరు వంటివి కల్పించడంలో అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వీడాలి. తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు రోడ్లమీదే పెట్టారు. బస్టాండ్ ఇరుకుగా మారింది. సమీపంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే కూరగాయలు, ఇతర వ్యాపారులు మార్కెట్‌లోకి పోతే బస్టాండు ఆవరణలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

విద్యాద్ఘాతంతో యువరైతు మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం సంగాల గ్రామానికి చెందిన యువ రైతు బోయ నరసింహులు (35)విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే నరసింహులు వరి పంటకు సాగు నీళ్ల కట్టే పనిలో భాగంగా నదికి వేసుకున్న మోటార్ దగ్గరికి వెళ్ళాడు. నీళ్ల అడుగంటగా పైపును దూరంగా కుంటల దగ్గరికి వేశారు. విద్యుత్ సరఫరా వేళ రాగానే స్విచ్ బోర్డుకు అప్పటికే తాకిన ఇండక్షన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వాన్ని అన్ని విధాల ఆదుకోవాలని స్థాయినకులు కోరారు. కేసు నమోదు చేసుకుని సి బెళగల్ ఎస్ఐ మన్మధ విజయ్ దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో పెరిగిన కుక్కల బెడద

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ఏ వీధిలో చూసినా, ఎక్కడ చూసినా కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, వాటిని నివారించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్,నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్. మొహమ్మద్ షరీఫ్ నగరపాల సంస్థ కమిషనర్‌కు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వృద్ధులు, చిన్నపిల్లలు రోడ్లమీదకి రావాలంటే కుక్కలతో భయభ్రాంతులకు గురి కావాల్సిన పరిస్థితి ఉందన్నారు. చాలా చోట్ల కుక్కలు పిల్లలపైన ,వృద్ధుల పైన దాడులు చేస్తున్నాయని తెలిపారు. రాత్రి 8 అయితే చాలు బయటికి రాలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. ఈరోజు నగరపాలక సంస్థ హెల్త్ అధికారులు ఆ రకంగా వ్యవహరిస్తున్నారా అని అనుమానం కలుగుతావుందని పేర్కొన్నారు. మున్సిపల్ నగర పాలక అధికారులు కుక్కలను ,తీసుకొని పోయి ఆపరేషన్లు చేసి వదిలి వేస్తున్నామని చెప్తున్నారు తప్ప, దాని వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. తిరిగి ఆ కుక్కలను అదే వీధిలో వదిలివేయడం వల్ల ప్రజల పైన ,పిల్లలపైన వృద్ధుల పైన దాడులు చేసి గాయాలపాలు చేస్తున్నాయన్నారు. తక్షణమే నగరపాలక సంస్థ, పాలకమండలి, కమిషనర్, హెల్త్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి ప్రజలను రక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

టిడిపితోనే నాయిబ్రాహ్మణులకు న్యాయం : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి అధికారంలోకి వస్తే నాయి బ్రాహ్మణులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టి జి భరత్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్‌లో టిజి భరత్ సమక్షంలో 51వ వార్డు కొత్తపేటకు చెందిన నాయి బ్రాహ్మణులు టిడిపి నేతలు చెన్నప్ప, రంగారెడ్డిల ఆధ్వర్యంలో టిడిపి చేరారు. వచ్చే ఎన్నికల్లో కర్నూల్లో టిజి.భరత్‌ను గెలిపించుకునేందుకు తాము కృషి చేస్తామని నాయి బ్రాహ్మణులు తెలిపారు. అనంతరం టిజి.భరత్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కర్నూలులో తనను గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానన్నారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాసులు, నవీన్ కుమార్, కుమార్, అజయ్, గోవిందు, తులసి, మల్లికార్జున, బాబు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, కృష్ణబాబు, నారాయణలు ఉన్నారు.

టిడిపిలో చేరిన బంగారుపేట ప్రజలు

కర్నూలు నగరంలోని 13వ వార్డు బంగారుపేటకు చెందిన యువకులు కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి భరత్ సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి నేతలు సురేష్, శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో హుసేన్ ఖాన్, షేర్ ఖాన్, మెహబూబ్ ఖాన్, రియాజ్ ఖాన్ కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిజి భరత్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అవధూత రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలలో గౌరు దంపతులు

వైభవంగా శ్రీ రామిరెడ్డి తాత ఆరాధన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పాత కల్లూరు లో శ్రీ అవధూత రామిరెడ్డి తాత 31వ ఆరాధన మహోత్సవం సోమవారం తాత సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి అధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై తాత ఆరాధన లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైరెడ్డి శబరి, కల్లూరు పెద్దలు, కల్లూరు తోపాటు ఆంధ్ర తెలంగాణ కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు సంస్థాన్ సభ్యులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎటూ తేలని వ్యవహారం...

- టిడిపి ఆదోని టిక్కెట్ ఎవరికి..?
- పెరుగుతున్న ఆశావహులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ వ్యవహారం ఎటూ తేలడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి టిడిపిలో టిక్కెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. వ్యతిరేక ఓటు చేజారి పోకుండా, జగన్‌ను ఎదుర్కోవాలంటే పొత్తు అవసరమని భావించి రాష్ట్రవ్యాప్తంగా టిడిపి, జనసేన పొత్తు కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదోని టిక్కెట్ టిడిపికా.. లేదా జనసేనకా అని చర్చ సాగుతోంది.

ఎన్నికల సమయం దగ్గర పడడంతో టిడిపిలో టిక్కెట్ ఆశించే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో అధికార వైసిపిపై వ్యతిరేకత, స్థానికంగా ఉన్న పార్టీ నాయకత్వంపై కూడా వస్తున్న విమర్శల నేపథ్యంలో ఈసారి ఎలాగైనా ఆదోనిలో టిడిపి విజయం సాధించడం ఖాయమని, టిక్కెట్ దక్కించుకుంటే గెలుపు సులభతరమని ఆశావహులు పేర్కొంటున్నారు.

క్యూ కడుతున్న నేతలు

టిక్కెట్ కోసం అమరావతిలోని టిడిపి జాతీయ కార్యాలయానికి నాయకులు క్యూ కడుతున్నారు. ఆదోనిలో ఈసారి టిడిపికి అనుకూల పవనాలు వీస్తున్నాయని పలు సంస్థల సర్వేల్లో కూడా తేలినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో అనేకమంది పోటీకి ముందుకొస్తున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆదోని నియోజకవర్గం నుంచి ఆరు సార్లు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి మూడు సార్లు గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై రెండుసార్లు వరుసగా పోటీ చేసి ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో కీర్తిశేషులు, ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గాలి ఉన్నా, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ విజయం సాధించినా ఆదోనిలో మాత్రం సాయిప్రసాద్ రెడ్డిపై మీనాక్షి నాయుడు విజయం సాధించారు. 1994లో మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్యపై, అలాగే 1999లో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డిపై మీనాక్షి నాయుడు గెలుపొందారు. 2004లో సామాజిక సమీకరణలో భాగంగా ఆదోని టిక్కెట్ వాల్మీకి వర్గానికి చెందిన గుడిసె ఆది కృష్ణమ్మకు టిడిపి అధిష్టానం కేటాయించింది. ఆ ఎన్నికల్లో గుడిసె ఆది కృష్ణమ్మపై సాయిప్రసాద్ రెడ్డి విజయం సాధించారు. వైసిపి నుంచి ఎంపీగా గెలుపొంది టిడిపిలో చేరిన బుట్టా రేణుక 2019లో ఆదోని టిక్కెట్ కోసం గట్టిగానే ప్రయత్నించారు. అధిష్టానం మాత్రం తిరిగి ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకే టిక్కెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ గాలి వీచి, వైసిపి ఎమ్మెల్యేలు భారీ మెజారిటీతో గెలుపొందినా ఆదోనిలో మాత్రం మీనాక్షి నాయుడు గట్టి పోటీనే ఇచ్చినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈసారి టిక్కెట్ మీనాక్షి నాయుడుకే వస్తుందని, విజయం కూడా సాధిస్తారని ఆయన గ్రూపు ధీమా వ్యక్తం చేస్తోంది.

జనసేన ఆశలు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని నియోజక వర్గంలోనే జనసేన పార్టీ బలంగా ఉందని నాయకులు పేర్కొంటున్నారు. జనసేన ఇన్‌ఛార్జీ, మెగా ఫాన్స్ జిల్లా అధ్యక్షులు మల్లప్ప అలియాస్ మల్లికార్జున 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి 12 వేలకు పైగా ఓట్లు సాధించారు. అధికార పార్టీ నాయకుల వ్యవహారాలు, లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపడంలో జనసేన నాయకులు ముందు వరుసలో ఉన్నారని పలువురు చెబుతున్నారు. ఈసారి జనసేనకే ఆదోని టిక్కెట్ ఖాయమని ఆ పార్టీ నాయకులు నమ్మకంతో ఉన్నారు. ఆదోనికి చెందిన ప్రముఖ నిర్మాత టిజి.విశ్వప్రసాద్‌తో మల్లప్పకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఆయన సైతం ఆదోని టిక్కెట్ మల్లప్పకు ఇప్పించడానికి సహకారం అందిస్తారని నమ్ముతున్నారు. టిజి.విశ్వప్రసాద్‌కు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, పార్టీ ప్రధాన నాయకులు నాదెండ్ల మనోహర్‌తోనూ మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ చనువుతో మల్లప్పకే ఖాయమని ఆ పార్టీ కేడర్ విశ్వాసంతో ఉంది.

టిడిపి నుంచి పలువురు

టిడిపిలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మలు టిక్కెట్ ఆశిస్తూ, అధిష్టానం మెప్పుకోసం విడివిడిగానే కార్యక్రమాలు చేపడుతున్నారు. మైనారిటీలకు కేటాయిస్తే తనకే ఇవ్వాలని గత ఎన్నికల్లో మాజీ ఎంపీ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు టిడిపిలో చేరిన ఆదోని పెద్ద మసీదు కమిటీ నిర్వాహక ఛైర్మన్ సౌదీ రావుఫ్, ప్రముఖ వ్యాపారవేత్త ఉమ్మి సలీమ్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆర్యవైశ్య వర్గానికి చెందిన కాకుబాల్ నగేష్, ఆదోని జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ కూడా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడును కలిసి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

బిజెపి నుంచి కూడా...

బిజెపితో జనసేన, టిడిపి పొత్తు ఏర్పడితే టిక్కెట్ తమకే ఖాయమని బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సైతం ఇటీవల మీడియా ముఖంగా ప్రకటించారు. ఎంపీ టిజి.వెంకటేష్ సహకారంతో విట్టా రమేష్ బిజెపి తరఫున అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు సమాచారం. వైసిపి నుంచి జనసేనలోకి చేరిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ ఛైర్మన్ రమేష్ యాదవ్ జనసేన, టిడిపి పొత్తులో భాగంగా ఆదోని టిక్కెట్ జనసేనకు రాదని, అందుకే ఆయన యూటర్న్ తీసుకుని బిజెపిలో చేరారని, బిజెపి నుంచి టిక్కెట్ కోసం స్పష్టమైన హామీ పొందినట్లు కూడా ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఆదోని టిక్కెట్ కోసం టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఎవరికి వారుగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామీణ పోటీలను ప్రోత్సహించాలి

- సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - దేవనకొండ

బహుమతులు అందిస్తున్న నాయకులు

సంక్రాంతి పండగ సాంప్రదాయాల ముసుగులో కోడి పందేలు, గుండాట వంటి జూదాలకు స్వస్తి పలికి గ్రామీణ ప్రాంత క్రీడలు, ముగ్గుల పోటీలను ప్రోత్సహించాలని సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న కోరారు. సంక్రాంతి పండగ సందర్భంగా డివైఎఫ్ఐ, వ్యకాస, రైతుసంఘం, రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో నిర్వహించిన ముగ్గులు, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా వారు హాజరయి మాట్లాడారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మహిళల ముగ్గుల పోటీలు ఆకర్షించే విధంగా ఉన్నాయని, గ్రామస్తులను ఒక చోటికి చేర్చేలా ఈ పోటీలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ప్రజా సంఘాల కమిటీలకు సూచించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన మూడు జట్లకు ఆ గ్రామ జ్యోతి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ తిప్పన్న బహుమతులు అందించారు. గ్రామ పెద్ద హనుమంతు రెడ్డి, డివైఎఫ్ఐ కార్యదర్శి రాఘవేంద్ర, ప్రజా సంఘాల నాయకులు సూరి, ఉప సర్పంచి కౌలుట్ల స్వామి, మహబూబ్ బాషా, సుభాన్, రామాంజనేయులు, కుంకనూర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభిమాన నాయకుల మధ్య సంక్రాంతి

వేడుకల్లో పాల్గొన్న ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి కుటుంబ సభ్యులు, విధేయులు, అభిమాన నాయకుల మధ్య సంక్రాంతి పండగ జరుపుకున్నట్లు టిడిపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం టిడిపి రాజనగర్ క్యాంపు నాయకులు సుబ్రమణ్యం రాజు ఆహ్వానం మేరకు టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉల్లిగయ్య, ముత్తు రెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, రాఘవేంద్ర రెడ్డిలు విందును స్వీకరించారు. తెలుగు యువత సురేష్ నాయుడు, రామకృష్ణారెడ్డి, నర్సారెడ్డి, పి.నాగిరెడ్డి, నరేష్ నాయుడు, నీలకంఠ రెడ్డి, హాల్వి సిద్ధప్ప, రామలింగన్న, సొట్టయ్య, లక్కే, గోవిందు, ముక్కన్న, గుండప్ప, బుడదొడ్డి, గాలం వీరేష్, చూడి వెంకటేష్, వీరారెడ్డి, పి.వీరేశ, గంగప్ప, గలం నారాయణ, గగ్గయ్య, నరసన్న, నరసింహులు, జి.భీమిరెడ్డి, లక్ష్మారి వీరేష్, కాకం రామాంజినేయులు, అమ్ము వాలీ, కృష్ణ, మౌనేష్, నాగరాజు, భీమేష్, షేక్ పాల్గొన్నారు.

అనాథలకు పాలు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మాయావతి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ పేద అనాథ బాలబాలికల సంరక్షణ కేంద్రంలో మంగళవారం పిల్లలకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముందుగా బీఎస్పీ జిల్లా నాయకులు ఎసి.దేవదానం, నియోజకవర్గ నాయకులు ఎస్.నరసన్న, బి.జయరాజు, ఎస్.బాలరాజు, ఈరేష్, వికలాంగుల హక్కుల పోరాట సంఘం నాయకులు కె.రామాంజనేయులు, బాబురావు కేక్ కట్ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు సింగనేటి ప్రతిభ భారతిని రామాంజనేయులు, బాబురావు శాలువా, పూలమాలలతో సన్మానించారు. బీఎస్పీ నాయకులు గడ్డం ఉసేని, పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు కె.నాగరాజు, ఎస్.రాజు, జి.మనోహర్, వడ్డే అంబమ్మ, సాతర్ల మహేష్, మహానంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

దేవనకొండలోని మాల వీధిలో ప్రధాన రహదారి వెంట ఉన్న తాగునీటి పైపులైన్ లీకేజీకి పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. లీకేజీతో నీరు కలుషితం, వృథా అవుతున్న తాగునీరు అనే శీర్షికన రెండు రోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీం పంచాయతీ సిబ్బందితో సోమవారం మరమ్మతులు చేపట్టారు. నీరు కలుషితం, వృథా కాకుండా చర్యలు తీసుకోవడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బదినేహాళ్ గ్రామం శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఈ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వీరభద్ర రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి మేలిగిరి ఈరన్న, నాయకులు ఉలిగయ, పీర్ సాబ్, మహిళా పోలీసును సెలక్షన్ కమిటీ సభ్యులుగా నియమించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి వీరభద్ర రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. మహిళలందరికీ రవికలు, మొదటి బహుమతి, రెండో బహుమతి, మూడో బహుమతి, నాలుగో బహుమతి అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న నాయకులు

రమణీయం.. రామలింగేశ్వరస్వామి రథోత్సవం...

- అభిమానులను ఉత్సాహ పరచిన నేతలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రాంపురం గ్రామంలో తుంగభద్ర నదీతీరంలో వెలసిన రామలింగేశ్వర స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. మంగళవారం మకర సంక్రాంతి పండగ సందర్భంగా రామలింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. రాంపురం జాతర సందర్భంగా రాంపురం రెడ్డి సోదరులు, వారి కుటుంబ సభ్యులు, వంశస్తులు, యువనేతలు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి ఆకులతో, పూలహారాలతో, కాషాయ జెండాలతో, విద్యుద్దీపాలతో అలంకరించిన కొయ్య రథోత్సవంపై రాత్రి 7 గంటలకు ఆలయ పూజారి రామలింగేశ్వర స్వామి మూర్తిని అధిష్టింప చేసి, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పుర వీధుల్లో భక్తజన సందోహం మధ్య వైభవంగా ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గం నుంచే కాక ఎమ్మిగనూరు, ఆదోని, గుంతకల్లు, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రెడ్డి సోదరుల నేతృత్వంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామి రెడ్డి, వారి కుమారులు ధరణీధర్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, జయమనోజ్ రెడ్డి, భీమిరెడ్డి, నైరుతి రెడ్డిలు అభిమానులకు అభివాదం చేస్తూ అందరిని ఆకర్షించారు. వైసిపి కోసిగి మండలాధ్యక్షులు మురళీ రెడ్డి, మంత్రాలయం మండల అధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రాంపురం జాతరలో ఎమ్మెల్యేలు, యువ నాయకులు

భయపెడితే భయపడం...

- జిఒ ప్రతులను దహనం చేసి అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

భయపెడితే భయపడబోమని అంగన్వాడీలు హెచ్చరించారు. సోమవారం సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ఎస్మా కాపీలను సంక్రాంతి పండగ భోగి మంటల్లో వేసి నిరసన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, ఎఐటియుసి నాయకులు విజయ్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 35 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. జీతాలు ఎంత పెంచుతామనే విషయంపై స్పష్టత ఇవ్వకుండా పెంచుతామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. మీనా కుమారి, శాంతమ్మ, రత్నమ్మ, లక్ష్మి, సుజాత, లక్ష్మీదేవి, సుగుణ, సువార్త, రమణమ్మ, శారద, ఈరమ్మ, ఆంథోనమ్మ, సరస్వతి, సుస్మిరి పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 36వ రోజుకు చేరింది. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, లావణ్య, సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు అంజి పాల్గొన్నారు. **ఆలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని దండం పెడుతూ నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ, ప్రభావతి, సిపిఎం నాయకులు కృష్ణ, గోవర్ధన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **కోసిగిలో** గోమాతకు పూజలు చేస్తూ అంగన్వాడీలు నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, వ్యకాస మండల కార్యదర్శి నాగేంద్ర, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉసమ్మ, వరలక్ష్మి, పద్మ, సరోజ, లలిత, లత, ఈరమ్మ, భీమ లింగమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

ఆదోనిలో జిఒ ప్రతులను కాల్చుతున్న అంగన్వాడీలు

కోసిగిలో ఆవును పూజిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఆలూరులో మాట్లాడుతున్న నాయకులు

కుళాయి నీటిని చూపిస్తున్న మాధవ రావు దేశాయి

తాగునీరా.. మురుగునీరా..?

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం

గ్రామస్తులకు స్వచ్ఛమైన సరఫరా చేయకుండా మట్టితో కలిసిన నీటిని సరఫరా చేసి, ప్రజారోగ్యాలతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఆడుకుంటున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి తెలిపారు. మంగళవారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని రూ.కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయకుండా మురుగు నీటిని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి మట్టి నీటిని తాగితే ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని, అధికారులు మేల్కొని మంచినీటిని సరఫరా చేయలని కోరారు. వేసవి దగ్గరలోనే ఉందని, అప్పుడే గ్రామంలో నీటి కొరత ఎక్కువైందని తెలిపారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల్లోపు కుళాయిలు పారించి, వెంటనే బంద్ చేస్తున్నారని తెలిపారు. మట్టితో కలిసి నీటిని సరఫరా చేయడంతో ప్రజలు ఆ నీటిని తాగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేయాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని దేవనకొండ సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వెలమకూరు, పి.కోటకొండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతంగా కలిసి మెలిసి జీవించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పాలకుల విధానాలతో కళ తప్పుతున్న పండగలు

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

సంతోషంగా జరుపుకోవాలని పండగలు పాలకుల విధానాలతో కళ తప్పుతున్నాయని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు. సోమవారం మండలంలోని నౌలేకల్ గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంక్రాంతి సంబరాలు'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. అంతకుముందు ముగ్గుల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండగ అంటే గ్రామాల్లో పంటలు చేతికొచ్చి రైతులు కుటుంబాలతో కలిసి సంతోషంగా జరుపుకునే పండగ అని తెలిపారు. నేడు సంక్రాంతి పండగలో కాంతి లేదన్నారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు సరైన దిగుబడి రాక అప్పుల పాలయ్యారన్నారు. గ్రామాల్లో పనులేక వలసలు వెళ్లారని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగిరెడ్డి, మండల కార్యదర్శి దేవదాసు, నాయకులు రాజేంద్ర, నరసింహులు, గోవిందు, సుందర్ రాజు, బాబు, నారాయణ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామన్న

ముగిసిన కబడ్డీ పోటీలు....

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజుల పాటు మండల సేవా సమితి రామకృష్ణ, అరవిందు, హేమంత, విజయ్, మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు ఆడడంతో మానసిక ఉత్సాహం వస్తుందని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.20,116 గోనెగండ్ల జట్టుకు వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి ఇచ్చిన బహుమతిని వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు. రెండో బహుమతి రూ.10,116 తంగర డోణ జట్టుకు ఆర్‌ఆర్ ఫార్మసీ నిర్వాహకులు మిథులా రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మూడో బహుమతి రూ.5,116 శంకరబండ జట్టుకు బోర్ వెల్ నిర్వాహకులు మేకల రంగనాథ్ చేతుల మీదుగా అందజేశారు. ఆర్గనైజర్స్ నరసప్ప, నరసింహ, రాజు, బాలముని, మహేష్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సభ్యులు

తాళం పడితే ఇల్లు గుల్లే

- ఆరు ఇళ్లల్లో చోరీ

ప్రజాశక్తి - ఆదోని

తాళం వేస్తే ఇల్లు గుల్లే అవుతున్న పరిస్థితి ఆదోనిలో నెలకొంది. కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లాలంటే చోరీలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్న పరిస్థితి ఉంది. పట్టణంలోని ఇంద్రానగర్ సమీపంలో ఉన్న టీచర్స్ కాలనీలో వరుసగా ఆరు ఇళ్లలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం ఈ సంఘటన వెలుగు చూసింది. సంక్రాంతి సెలవులు ఉండడంతో టీచర్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు ఓ ఇంట్లో 3 తులాల బంగారు, రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు టీచర్ పెద్దయ్య, లెక్చరర్ వీరన్న వివరించారు. మిగతా నాలుగు ఇళ్లలో కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించారు. టీచర్ పెద్దయ్య మాట్లాడుతూ... తాను పక్కనే ఉన్న తన పాత ఇంట్లో ఉన్నానని, తెల్లవారుజామున వచ్చి చూస్తే తన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని తెలిపారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని బీరువాలో ఉన్న వస్తువులుగా చెల్లాచెదురుగా పడి ఉన్నాయని చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న ఈరన్న మాట్లాడుతూ... సంక్రాంతి పండుగకు వేరే గ్రామానికి వెళ్లానని, తనకు కాలనీ వారు ఫోను చేసి చెప్పడంతో అక్కడికి వెళ్లానని తెలిపారు. ఇంట్లో పరిశీలించగా తన పిల్లలు దాచుకున్న హుండీని, దేవుని హుండీలోని విలువైన పెద్ద నోట్లు తీసుకుని వెళ్లారని, చిల్లరు వదిలేశారని వివరించారు. ఇప్పటికే ఈ కాలనీలో రెండుసార్లు దొంగతనం జరిగిందని, కాలనీలో భద్రత లేకుండా పోయిందని తెలిపారు. పోలీసులు గస్తీని ఏర్పాటు చేయాలని కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బీరువాను తెరిచిన దొంగలు

కార్యకర్తలే బలం.. బలగం...

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

టిడిపికి కార్యకర్తలే బలం.. బలగమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో టిడిపి కార్యకర్త తిక్కస్వామి గౌడ్ అన్న కుమారుడు వేణుగోపాల్ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ గౌడ్ తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరులు శ్రీనివాస్ రెడ్డి చెట్నిహళ్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామరెడ్డి, సున్నం రామకృష్ణ ఉన్నారు.

మొదలైన తాగునీటి ఎద్దడి

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

మండలంలోని చిన్న హ్యాట గ్రామంలో తాగునీటి ఎద్దడి మొదలైంది. 5, 6 రోజులకోసారి నీటిని సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మతగేరి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, ఎస్ఎస్ ట్యాంకులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నప్పటికీ నీటిని పంపింగ్ చేయించి విడుదల చేయడంలో సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాళ్ల పొలం, బీసీ కాలనీకైతే నీళ్లు ఎక్కకపోవడంతో బొమ్మ గుండనహళ్లి క్రాస్ వద్ద, బోరుబావులు దగ్గర నీటిని తెచ్చుకొని తాగుతున్నామన్నారు. వేసవి మొదలు కాకముందే ఇలాంటి పరిస్థితి ఏర్పడితే వేసవిలో తమ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని వాపోయారు. బీసీ కాలనీకి ప్రత్యేకంగా పైపులైన్ అయినా వేయాలని, మినీ తాగునీటి ట్యాంకు నిర్మాణమైనా చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

అంబేద్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

- వైసిపి ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా హాజరై విజయవంతం చేయాలని వైసిపి ఆలూరు సమన్వయకర్త విరుపాక్షి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరినీ ఆకర్షించేలా అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి వాటితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు.

హొళగుంద : విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం ప్రారంభోత్సవానికి తరలివచ్చి జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జి.మహానంది కోరారు. మంగళవారం హొళగుందలోని ఎల్ఎల్‌సి గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. మాల మహానాడు జిల్లా సహాయ కార్యదర్శి పెద్దహ్యాట వీరభద్ర మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. సీనియర్ నాయకులు మల్లేష్, పంపన్న, ఉపేంద్ర, చిదానంద, మల్లి పాల్గొన్నారు.

క్రీడలు ఔన్నత్యాన్ని పెంచుతాయి

- డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

క్రీడలు జాతీయ ఔన్నత్యాన్ని పెంచుతాయని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, నాయకులు మోహన్ తెలిపారు. సోమవారం ఆదోనిలోని మండిగిరి ప్రాంతంలో సంక్రాంతి పండగ సందర్భంగా డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. అంతకుముందు డివైఎఫ్ఐ మాజీ నాయకులు లక్ష్మణ్, వెంకీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ... చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులు లక్ష్య సాధన శక్తిని కలిగి ఉండాలన్నారు.

కైలాస వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

నాడు అక్కచెల్లెమ్మలన్నాడు... నేడు పట్టించుకోవడం లేదు..

నంద్యాలలో పతంగులను ఎగురవేస్తూ అంగన్వాడీల నిరసన

బేతచెర్లలో విస్తర్లలో మట్టిని తింటూ అంగన్‌వాడీల నిరసన

- పండగ పూటా పస్తులున్న అంగన్‌వాడీలు - చర్చల పేరుతో కాలయాపన తగదు
- 36వ రోజూ అంగన్‌వాడీల నిరవధిక సమ్మె - పతంగులు ఎగరేస్తూ, మట్టి, పచ్చి గడ్డి తింటూ, కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి - విలేకరులు

'ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీల పట్ల కక్షపూరితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మహిళలను, అంగన్వాడీలను నాడు పాదయాత్రలో అక్కాచెల్లెళ్లలని చెప్పారు.. నేడు ఆ అక్కచెల్లెమ్మల బాధలను పట్టించుకోవడం లేదు. సంక్రాంతి పండగ రోజు కూడా మహిళలను రోడ్ల పైన కూర్చో పెట్టారు... కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరితే సిఎం మంత్రులను, సలహాదారుల ద్వారా చర్చలు జరుపుతూ కాలయాపన చేస్తున్నారు. తక్షణమే మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి' అని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె 36వ రోజు మంగళవారం కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో గాలిపటాలు ఎగరేస్తూ, ఆత్మకూరులో కళ్లకు గంతలు కట్టుకుని, బండి ఆత్మకూరులో పచ్చిగడ్డి తింటూ, బేతంచెర్లలో విస్తరాకుల్లో మట్టి తింటూ ప్రభుత్వంపై నిరసన తెలిపారు.

నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడీల పట్ల కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించకుండా కనీస వేతనం పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్షులు డి.లక్ష్మణ్, కెఎండి గౌస్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి, ప్రాజెక్టు కార్యదర్శి సునీతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. నంద్యాల జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన శిబిరం నుండి పతంగులను ఎగురవేస్తూ, పతంగుల ద్వారా డిమాండ్లను ముఖ్యమంత్రికి లేఖల రూపంలో సమాచారం పంపిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచలేమంటూ, జులైలో పెంచుతామని చెప్పడం చూస్తే అంగన్వాడీలను మభ్యపెట్టడమేనని అన్నారు. జులైలో మిగతా 6వ పేజీలో...

కైలాస వాహనంపై స్వామి అమ్మవార్లు

శ్రీశైలంలో కనుమ కార్యక్రమం

ప్రజాశక్తి - శ్రీశైలం

మకర సంక్రమణన్ని పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కనుమ కార్యక్రమాన్ని దేవస్థానం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చక్రపాణి రెడ్డి, ఏఈఓ మోహన్, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొని స్వామి అమ్మ వార్లకు మహా మంగళ హారతులు, అనంతరం దేవస్థానం గోశాలలో గో పూజలు నిర్వహించారు. అలాగే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక విశేష పూజ కార్యక్రమాలు చేశారు.

కైలాస వాహనంపై స్వామి అమ్మవార్లు

సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి అమ్మ వార్లకు కైలాస వాహన సేవా కార్యక్రమాన్ని గ్రామోత్సవంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను కైలాస వాహనంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వేదమంత్రాల పటణం మధ్య విద్యుత్ దీపాలంకరణలు, వివిధ రకాల కళా నృత్య ప్రదర్శనలు, కోలాటం, చెక్కభజనల మధ్య గ్రామోత్సవాన్ని కృష్ణదేవరాయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింప చేసి గంగాధర మండపం వద్ద మరోసారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామిల మీదుగా ఆలయంలోకి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

గో పూజ చేస్తున్న చైర్మన్, ఇఒ తదితరులు

జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో గత రెండు రోజుల్లో అన్నీ పోలీసు స్టేషన్ పరిధులలో చెక్ పోస్టల వద్ద పోలీసులు, సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తనిఖీలలో భాగంగా నాటు సారాపై దాడులు నిర్వహించి 26 కేసులు నమోదు చేసి 14 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుండి 182 లీటర్ల సారాని, 10 డీపీఎల్ కేసులలో 325 డీపీఎల్ మద్యం బాటిళ్ళను పోలీసులు సీజ్ చేశారన్నారు. సుమారు 2950 లీటర్ల బెల్లం ఊటను ద్వంసం చేశమని తెలిపారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలో కోడిపందాలు ఆడుతుండగా వారిపై దాడి చేసి 15 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 10 కోళ్ళను, 40 మోటార్ సైకిళ్లను రూ.19 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 కేసులు నమోదు చెయ్యడంతో పాటు 14 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నేడు 51 బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత అధికారుల వద్ద హాజరు పరిచినట్లు తెలిపారు. డోన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఒక మట్కా కేసు నమోదు చేసి రూ. 3,900 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్ పరిదిలో పేకాట ఆడుతున్న వారిపై రైడ్స్ నిర్వహించి, 12 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ1,28,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా నాటు సారా తయారీ, రవాణా, విక్రయం చేసినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, పలుమార్లు కేసులలో ఉన్న వారు వారి ప్రవర్తనలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమతి లేకుండా భూములు తీసుకోరాదు

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మండలంలో రైతులు అనుమతి లేనిదే సోలార్‌కు భూములు తీసుకోరాదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాతపాడు, పత్తినగరం, కటికవాని కుంట గ్రామాలలో ఎపి రైతు సంఘం జిల్లా బృందం పర్యటించి, రైతులతో మాట్లాడారు. 'మా తాతల, తండ్రుల కాలం నుంచి ఈ భూమినే నమ్ముకుని, రెక్కల కష్టంతో జీవిస్తున్న మాకు ఉన్న ఈ భూములు పోతే, మా అందరికీ ఆత్మహత్యలు శరణం తప్ప వేరే మార్గం లేదు' అని రైతులు రైతు సంఘం నాయకులతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు మాట్లాడారు. పాతపాడు, యాగంటి, మీరాపురం, పత్తే నగరం, కటికవానికుంట గ్రామాలలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయుటకు 350 మంది రైతులకు సంబంధించి సుమారు 650 ఎకరాల భూములు అనుమతి లేకుండానే తీసుకుంటున్నట్లు సోలార్ ప్రాజెక్ట్ వారు ప్రకటించి, ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో ముందుగా డ్రిల్లింగులు చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఇప్పటికే పాణ్యం మండలం, ఓర్వకల్లు మండలాల్లో రైతుల భూములను బలవంతంగా లాక్కొని సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, ఈ ప్రాజెక్టులకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సహకరిస్తున్నారని విమర్శించారు. 2013లో భూసేకరణ చట్టం చేశారని, కానీ ఆ చట్టాన్ని ఎక్కడ కూడా అమలు చేయడం లేదన్నారు. రైతుల భూములు లాక్కోవడానికి అధికార పార్టీ అండతో, సోలార్ ప్రాజెక్టు వారు దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకొని వెంటనే గ్రామ సభలు జరిపి రైతుల అభిప్రాయం తెలుసుకోవాలని, అభిప్రాయానికి వ్యతిరేకంగా భూసేకరణ చేపడితే, ఆయా గ్రామాల రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సుబ్బయ్య, మద్దిలేటి, పాతపాడు దొర్నిపాటి వెంకటేశ్వర్లు, వెంకట కళాధరుడు, నారాయణరెడ్డి, జే మహేంద్ర, బగడదల సత్యం రెడ్డి, పత్తే నగరం గ్రామ రైతులు ఎల్ల కృష్ణుడు, గోపాల్, తిమ్మరాజు, బాబాయ్య, రమణయ్య, రామచంద్రుడు, మద్దిలేటిస్వామి, సురేష్ బాబు, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఆటో డ్రైవర్ కుమార్తె నిర్మలను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్ఐగా ఆటో డ్రైవర్ కుమార్తె ఎంపిక

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణం దుర్గాపేట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ శేషాద్రి మూడవ కుమార్తె నిర్మల ఎస్ఐ పోస్ట్‌కు సెలెక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా మంగళశారం బేతంచర్లలోని షాలేము ప్రార్ధన మందిరంలో సంఘం సభ్యులు నిర్మలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికుడు ఇంట్లో మెరిసిన ఆణిముత్యం నిర్మల అని కొనియాడారు. యువతీ యువకులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే ఏకాగ్రతతో విద్యనభ్యసించాలన్నారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని ఆటో డ్రైవర్ శేషాద్రి కుమార్తె నిర్మల నిరూపించిందని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్, ఉయ్యాలవాడ భాస్కర్, తిక్క మధు, శేఖర్, వరప్రసాద్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం లింగాల గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన ప్రభావతి, రాణి, లావణ్యలకు కామ్రేడ్ టి.రామకృష్ణ కుమారుడు టి.కిషోర్ భార్య అశ్విని బహుమతులను ప్రదానం చేశారు ఈ సందర్భంగా కిషోర్ అశ్విని మాట్లాడుతూ సంక్రాంతి పండగను సాంప్రదాయ పద్ధతిగా ప్రతి ఒక్కరు జరుపుకుంటారని, అనాదికాలం నుండి వస్తున్న సంప్రదాయాలను, ముగ్గుల పోటీలను నిర్వహించుకోవడం ఐక్యతకు చిహ్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు రవణమ్మ, సోమేశ్వరమ్మ, అనసూయమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, నాయకులు రామ్మూర్తి, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వైభవంగా సంక్రాంతి వేడుకలు

ఐదు గ్రామాల్లో పార్వేట ఉత్సవసంబరం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. సోమ మంగళవారాల్లో సంక్రాంతి పారువేట ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులను యాగంటి పల్లె, మీరాపురం, సాధు కొట్టం, మాదాసు పల్లె, పాతపాడు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో అలయ పూజారులు మహేష్ శర్మ, చిరంజీవి శర్మ, రాఘవేంద్రశర్మలు స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పార్వేటలో భాగంగా పల్లకిని పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లె, గ్రామాల ప్రజలు, భక్తులు పల్లకిని మంగళవాయిద్యాలతో కొండపై నుంచి కిందకు తీసుకువచ్చి కాలినడకన మూడు కిలోమీటర్ల దూరంలోని పాతపాడు వరకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం పల్లకికి పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, గ్రామప్రజలు ఎదురేగి స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మీరాపురం గ్రామస్తులు పల్లకిని తమ గ్రామానికి తీసుకెళ్లారు. రాత్రి మీరాపురంలో గ్రామోత్సవం, అనంతరం యాగంటిపల్లెకు చేర్చారు. మంగళవారం సాయంత్రం ఉమా మహేశ్వర ఉత్సవ విగ్రహాలను యాగంటికి చేర్చారు.



యాగంటి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రంగవల్లుల పండగ సంక్రాంతి

- ఎపి రైతు సంఘం, సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

తెలుగు సాంప్రదాయలకు రంగవల్లులు ప్రత్యేకంగా నిలుస్తాయని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, శ్రీ పద్మావతి హైస్కూల్ కరస్పాండెంట్ పి.ఆశ, స్పేస్ కంప్యూటర్ డైరెక్టర్ నూర్ బాషాలు పేర్కొన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణంలోని అర్బన్ కాలనీ, ఏకలవ్య నగర్, గొల్లపేట తదితర ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, కబడ్డీ పోటీలు డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, పద్మావతి హైస్కూల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్బన్ కాలనీలో ముగ్గుల పోటీల్లో విజేతలు దేవిక, లక్ష్మీ, రాజి, ఏకలవ్య నగర్‌లో ఐశ్వర్య, సోబిత, శృతి, మ్యూజికల్ చైర్ పోటీలలో మణి, రంగమ్మ, హరిత, భారతి, శ్రీలక్ష్మి, అమ్ములు, లీలాలకు బహమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి హైస్కూల్ హెచ్ఎం ముర్తుజావలి, ఐద్వా నాయకురాలు మంజుల, సిఐటియు నాయకులు ఎ.రణధీర్, పట్టణ కార్యదర్శి డి రామ్ నాయక్, మండల కార్యదర్శి భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, అధ్యక్షులు జి నాగేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు అయ్యమ్మ, పుల్లమ్మ, అక్కమ్మ, దాసమ్మ, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ.సురేంద్ర, చిన్న వ్యాపారస్తుల సంఘం టౌన్ కార్యదర్శి తుమ్మలూరు శివకుమార్, రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, చిన్న వలి, జాకీర్, ఇర్ఫాన్, వెంకటరావు, నూర్ అహమ్మద్, మహిళలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న శ్రీ పద్మావతి హైస్కూల్ కరస్పాండెంట్ పి.ఆశ

పెద్ద దేవలాపురంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైతులు ఇంతవరకు పంటలను పండించడంలో పడిన కష్టాన్ని మరిచిపోయేందుకే ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సీనియర్ న్యాయవాది తులసిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దదేవలాపురం గ్రామంలో లింగమయ్య స్వామి, పెద్దబాదుల స్వామి, చిన్నబాదుల స్వామి జాతర సందర్భంగా సుగాలి బాలన్న కుమారుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎద్దుల బలప్రదర్శన పోటీలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.తులసి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సురేష్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ప్రాచీనకాలం నుండి కొనసాగుతున్నా యని చెప్పారు. రైతులు ఎద్దుల బలప్రదర్శన పోటీలను సామరస్యంగా జరుపుకుని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గురుపాదం, టిడిపి నాయకులు వీరారెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, మహేష్, తారక్, షేక్ బాబు, పొట్టి, నిర్వాహక కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ న్యాయవాది తులసి రెడ్డి

బహుమతులు అందజేస్తున్న
వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

క్రీడల వల్ల యువతలో మంచి స్నేహభావం నెలకొంటుందని, క్రీడల్లో నేటి ఓటమి రేపటి గెలుపుగా క్రీడాకారులు భావించాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతోనే చెడు వ్యసనాలు దూరం చేయవచ్చన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలం చింతలాయిపల్లె గ్రామం పంచాయతీ పరిధి స్థాయిలో సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఆది టీం మొదటి బహుమతి రూ.10,016, నాగేశ్వర్ రెడ్డి టీం రెండో బహుమతి రూ. 5,016 కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబటి చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జయ రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీనారాయణ, గ్రామస్తులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నందివర్గం ఎస్ఐగా తిరుపాల్ బాధ్యతలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందివర్గం ఎస్ఐగా తిరుపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఉయ్యాలవాడకు బదిలీ అయ్యారు. దొర్నిపాడు ఎస్సైగా పనిచేస్తున్న తిరుపాల్‌ను నందివర్గానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నందివర్గం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపాల్

పరిశీలిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

గాంధీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీల

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని పాతబస్టాండ్‌లో జాతిపిత మహాత్మగాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ విగ్రహం పాతది విరిగి పోయినందున దాని స్థానంలో రూ.12 లక్షల మున్సిపల్ నిధులతో ఏడు అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో డిఇ. రసూల్, ఎఇ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి వారి గ్రామోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ రామకృష్ణ, ప్రధాన అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, కిట్టయ్య స్వామి, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అలాగే తమ్మారాజు పల్లె గ్రామంలో సర్పంచ్ బత్తుల విజయ గౌరి,బత్తుల శేశారెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఎద్దుల పందేలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు : సిఐ

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని పోతుదొడ్డి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఇంటర్ డిస్ట్రిక్ బోర్డర్ పోలీస్ చెక్ పోస్టను ఏర్పాటు చేశామని స్థానిక సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై రాజ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతు సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు, డిఎస్ పి సూచనల మేర అంతర్ జిల్లా పరిధి అయిన పోతుదొడ్డి గ్రామంలో చెక్ పోస్టను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి, పగలు ఇతర జిల్లాల నుండి రాకపోకలు కొనసాగించే వాహనాల తనిఖీలు ఉంటాయని, ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా నియంత్రించేందుకు పగడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోర్డర్ చెక్ పోస్టను ఏర్పాటు చేసిన పోలీసులు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని పెట్టుకొని కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఎపి హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ సొంత గ్రామం పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోటలో చిలుకల శంకర్ రెడ్డి, అంబటి మోక్షేశ్వర్ రెడ్డి, చిలుకల రామలింగారెడ్డి, మూర్తి రెడ్డి గారి యుగంధర్ రెడ్డి, ఎద్దుల రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. న్యాయమూర్తి హరినాథ్, ఆయన సతీమణి అనితమ్మను, తల్లిదండ్రులు బాల వెంకటరెడ్డి, కృష్ణవేణమ్మలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడారు. న్యాయమూర్తులు ఇలాంటి సన్మానాలకు, సభలకు దూరంగా ఉంటారని చెప్పారు. తమ గ్రామస్తులకు ఇలాంటి సన్మానాలు వద్దని చెబితే ఆత్మీయ సమ్మేళనమని చెప్పారన్నారు. 1996లో మంచి ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు తమ తల్లిదండ్రులు న్యాయవృతి ప్రాక్టీస్ చేయాలని సూచించారన్నారు. తన క్లాస్‌మెంట్లు ఎంతోమంది వివిధ రకాల ఉద్యోగాల్లో ఉన్నారని, ఏ ఉద్యోగంలో ఉన్నా వృత్తి పట్ల శ్రద్ధ ఉండాలన్నారు. తన సొంత గ్రామంలో ఆత్మీయ సమ్మేళనలో తనను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ సంక్రాంతి పండగను జీవితంలో ఎప్పుడు మర్చిపోలేనని అన్నారు. ప్రతి సంక్రాంతి పండగకు మర్చిపోకుండా గ్రామానికి వస్తానని తెలిపారు. 7వ అదనపు కర్నూలు జిల్లా న్యాయమూర్తి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామవాసి హైకోర్టు న్యాయమూర్తి అయినందుకు ఈ గ్రామానికి ఎంతో పేరు వచ్చిందన్నారు. హరినాథ్ ఇంకా అంచలంచెలుగా ఎదిగి భారత సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నందికొట్కూర్ సీనియర్ సివిల్ జడ్జి ఇంద్ర ప్రియదర్శిని మాట్లాడుతూ హరినాథ్ కాలేజీ రోజుల్లో ఎంతో చురుగ్గా, క్రమశిక్షణతో ఉండేవారన్నారు. హరినాథ్ తండ్రి బాల వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పండగకు గ్రామానికి వచ్చి గ్రామస్తులతో సంతోషంగా గడుపుతామని తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ జివిఎల్ రెడ్డి, కర్నూల్ బార్ అసోసియేషన్ సభ్యులు, నందికొట్కూర్ బార్ అసోసియేషన్ సభ్యులు, నంద్యాల బార్ అసోసియేషన్ సభ్యులు, ఆత్మకూరు డిఎస్పి వెంకటరమణ, విజయ భాస్కర్, రూరల్ ఎస్సైలు టిడిపి నందికొట్కూరు మాజీ ఇంచార్జి బండి జయరాజు, పగిడ్యాల మండల పాత్రికేయులు న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిలకల శంకర్ రెడ్డి, అంబటి మోక్షేశ్వర్ రెడ్డి, చిలకల రామలింగారెడ్డి, యుగంధర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన హరినాథ్ హైకోర్టు న్యాయమూర్తి అయినందుకు ఎంతగానో సంతోషిస్తున్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రారంభిస్తున్న ఎస్ఐ

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - రుద్రవరం

సంక్రాంతి సందర్భంగా మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో మంగళవారం జరిగిన చెన్నకేశవ స్వామి రథోత్సవ సందర్భంగా హోరాహోరీగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను రుద్రవరం ఎస్సై నిరంజన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు ఆడటం వల్ల స్నేహభావం పెంపొందుతున్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణిస్తూ మంచి పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువ నాయకుడు జంగా బాలేశ్వర్ రెడ్డి, పలువురు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణానికి చెందిన నీలి పుల్లయ్య అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబానికి అవుకు పట్టణ శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ నీరు కట్టు కిట్టు, మండల వైస్ ప్రెసిడెంట్ జానపాటి ప్రసాద్, సెక్రటరీ దంతల రమణ, మండల జాయింట్ సెక్రెటరీ దొర్నిపాటి వరప్రసాద్, ట్రెజరర్ జక్కా మధు,గుర్రాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడు రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రికెట్ పోటీలో మొదటి బహుమతి కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన యువకులు గెలుపొందారు. రెండవ బహుమతి రామాపురం గ్రామానికి చెందిన యువకులు, మూడో బహుమతి పెట్నికోట గ్రామానికి చెందిన యువకులు గెలుపొందారు. విజేతలకు జడ్పిటిసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు చల్లా చరణ్ రెడ్డి,చల్లా చైతన్య రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను అందిస్తున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

క్రీడలతోనే చెడు వ్యసనాలు దూరం : టిడిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతోనే చెడు వ్యసనాలు దూరం చేయవచ్చని టిడిపి మండల కన్వీనర్ నారపురెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపల్లిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లిలో శ్రీ తాండవ మల్లేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి కొత్తపల్లి జట్టుకు రూ. 15 వేలు దాత టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, రెండో బహుమతి ఆత్మకూరు జట్టుకు రూ. 10 వేలు దాత రాజ రాజేశ్వరి పాఠశాల, మూడవ బహుమతి తిమ్మరాజుపల్లి జట్టుకు రూ 6 వేలు, 4వ బహుమతి ఆత్మకూరు రూ. 3వేలు దాత ఉపసర్పంచి నడిపెన్న ఇచ్చారన్నారు. క్రీడా అభివద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి క్రీడాకారులను ప్రోత్సహించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

మొదటి బహుమతి అందజేస్తున్న టిడిపి మండల కన్వీనర్ నారపు రెడ్డి

విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

- ప్రముఖ పారిశ్రామిక వేత్త శెట్టి విజయ్ కుమార్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యారో కన్స్ట్రక్షన్ అధినేత, బలిజ కాపు అన్న సత్రం అధ్యక్షులు, ఎపి బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం క్షేత్రంలో లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరివెళ్ల మండల పరిధిలోని మజరా గ్రామం ఖాదరబాదరకు ఆయన వెళ్లారు. ఆయన రాకను పురస్కరించుకొని గ్రామ పెద్దలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామానికి చెందిన బండి రామచంద్రుడు కుమారుడు బండి చంద్ర రాకేష్‌కు శెట్టి విజయకుమార్ సైకిల్ పంపిణీ చేశారు. గ్రామం నుండి సిరివెళ్లలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న చంద్ర రాకేష్ రోజు నడుచుకుంటూ వెళ్లేవాడు. విషయం తెలుసుకున్న శెట్టి విజయ్ కుమార్ మానవతా దక్పథంతో విద్యార్థికి సైకిల్ అందించారు. ఈ సందర్భంగా శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో శెట్టి విజయ్ కుమార్ రెండవ కుమారుడు శెట్టి ప్రణీత్, రాయల్ కాప్స్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు గూడూరు సంజీవరాయుడు, ఏపీ, టీఎస్ రాష్ట్రాల యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివ రాయల్ (జర్నలిస్ట్), నీలి రామారావు, ప్రసాదు, సంతోష్, మునయ్య, బండి వెంకట చంద్రుడు, బండి ఎద్దుల చెన్నప్ప, బండి వెంకట చెన్నయ్య, సాయికుమార్, పవన్ కుమార్, శ్రీనివాసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ అందజేస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త శెట్టి విజయ్ కుమార్

సంత జూటూరులో పారువేట ఉత్సవం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని సంతజూటూరు గ్రామంలో మంగళవారం పారువేట ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రధాన పురోహితులు రంగనాథ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను నారాయణపురం గ్రామం వైపు నిలబెట్టి చొప్పకట్టలను కాల్చి సాంప్రదాయ ప్రకారం గొర్రె తోక కోసి విడిచిపెట్టారు. గ్రామానికి చెందిన యువకులు ఆ గొర్రెను పట్టుకున్న వెంటనే దేవతమూర్తుల పల్లకి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూమా జయరాం రెడ్డి, గ్రామ పెద్దలు కొంగిస పెద్ద లింగమయ్య, ఎలగల పెద్ద శేషన్న, నాగేంద్ర రెడ్డి, కృష్ణారెడ్డి, రఘునాథ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. **సంజామల :** మండల కేంద్రంలో కనుమ పండగ సందర్భంగా నిర్వహించిన పారువేటకు గొర్రె తోక కోసి వదలాక సంజామల గ్రామ యువకులు పట్టుకోవడానికి పదిమంది పరిగెత్తారు అందులో రాజు గొర్రెను పట్టుకొని గెలిచాడు.

సంత జుటూరులో పారువేట ఉత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

అభివృద్ధి చేసే వారిని ఆదరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అభివృద్ధి చేసే వారిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కొండపేట ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని, రూ. 25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని జయమ్మ, వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి చేయాలన్నా అడుగడుగునా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అడ్డుకుంటున్నారని విమర్శించారు. పట్టణ ప్రజలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు, పక్క గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో 3400 వేల మందికి ఇంటి స్థలాలు ఇస్తుంటే తనకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని హైకోర్టుకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే బీసీ అడ్డుకున్నారని తెలిపారు రెండు సెంట్ల స్థలం ఇస్తామని ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రజల వద్దకు టిడిపి నాయకులు వస్తున్నారని అన్నారు. 2 సెంట్ల చొప్పున 200 వందల ఎకరాలు అవసరమవుతుందని, అది సేకరించి పట్టాలు తయారు చేసి ప్రజల్లోకి వెళ్లాలని, అప్పుడు ప్రజలు, తాము నమ్ముతామని చెప్పారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, ఎంపీడీవో శివరామయ్య, పంచాయతీరాజ్ డిఈ నాగ శ్రీనివాసులు, ఏఈ గౌస్, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, బానుముక్కల సహకార పరపతి సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, వైసిపి నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, కాంట్రాక్టర్ కొవ్వూరు ముద్దయ్య, సురా కిషోర్ కుమార్, నారాయణ, నరసింహులు, వార్డ్ మెంబర్ ప్రసాద్, నరేంద్ర, గాదం శెట్టి వేణుగోపాల్, చిన్న సుబ్బరాయుడు, ఈసారి ఎల్లయ్య, సుబ్బయ్య దాస్, కొమ్ము వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, సైకిల్ షాప్ మహబూబ్ వలీ, జిల్లెళ్ళ శంకర్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, వార్డు మెంబర్ జిటి వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ శ్రీవేణి, ఎర్రగుడి సుబ్బారెడ్డి, టివి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ తదితరులు

టిడిపి కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని టిడిపి కార్యాలయం ఆవరణంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రాముఖ్యతను తెలుపుతూ వేసిన ముగ్గులు చూపరులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ ఎన్ఎండి.ఫరూక్ మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతులను గౌరవించాలన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన అభినందిస్తూ ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు గ్రైండర్, మిక్సీ, జ్యూసర్‌ను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఒక కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, టిడిపి నాయకులు బుగ్గ రాముడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అంగరంగ వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - పగిడ్యాల : సంక్రాంతి పండగను పురస్కరించుకొని సోమవారం తూర్పు ప్రాతకోట గ్రామంలో నాగేశ్వర స్వామి, పడమర ప్రాతకోటలో కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో టిడిపి నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూర్ నియోజవర్గ మాజీ ఇంచార్జి బండి జయరాజ్, నాయకులు గిత్త జయసూర్య, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కాశీ విశ్వేశ్వర స్వామివార్లకు, నాగేశ్వర స్వామి వార్లకు మాండ్ర శివానందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయులు సంఘటనలు జరగకుండా ముచ్చుమర్రి పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ప్రాతకోటలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నాడు అక్కచెల్లెమ్మలన్నాడు.. నేడు పట్టించుకోవడం లేదు..

5వ పేజీ తరువాయి.. జీతం పెంచుతామని చెప్పడం కాదు.. జులైలోనే పెంచుతామని జీవో రూపంలో ఇవ్వాలని, అప్పుడే సమ్మె విరమించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే దీనికి మాత్రం సమాధానం చెప్పకుండా పట్టీ పట్టనట్టు ఉంటున్నారని అన్నారు. కక్షపూరితంగా వ్యవహరిస్తే ఆ పర్యావసనం వేరే ఉంటుందని హెచ్చరించారు. సమ్మెకు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ రామరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా పండగ పూట పస్తులు ఉంచడం న్యాయమేనా అని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షెభారాణి ప్రశ్నించారు. మండల అధ్యక్ష కార్యదర్శులు ఎంకే నాగలక్ష్మి, గుల్జార్బి ఆధ్వర్యంలో బేతంచెర్ల సర్కిల్ నందు ఏర్పాటు చేసిన శిబిరంలో విస్తరాకులలో మట్టి పోసుకొని తింటూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీలు నరసమ్మ, నారాయణమ్మ, మద్దమ్మ, దస్తగిరమ్మ, మహేశ్వరి ,సులోచన, రాజేశ్వరి లక్ష్మీదేవి, మేరీ, శివలక్ష్మి సంతోష, కళావతి, ఆదిలక్ష్మి హసీనా, మధురవాణి, విజయమని, దేవమని పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు 36వ రోజు సమ్మె చేపట్టి, కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మండల కార్యదర్శి భాస్కర్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, భారతి, ఖాదర్ బి, నాగమణి, సిఐటియు నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, శివ కుమార్, వీరన్న, శ్రీధర్ పాల్గొన్నారు. **మహానంది :** మహానందిలోని తహశీల్దారు కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ దీక్షా శిబిరం ముందు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అంగన్వాడీలు చండీ దేవి, సావిత్రి, ఉషారాణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మెలో భాగంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఇ.హరిత, రమణమ్మ, శ్రీదేవి, అంగన్వాడీలు నాగమణి, వసంత, నాణెమ్మ, పద్మావతి, సరస్వతి పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు పచ్చిగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటరమణ, ఆనందమ్మ, వసంత, శ్యామల మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ప్లేట్లను గంటెలతో మోగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు మదార్‌బి, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, సుజాత కీర్తి, రజియా తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో అంగన్వాడి టీచర్లు సమ్మె కొనసాగించారు. అనంతరం సమ్మె సహాయ నిధి కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రమణ బాయ్, శ్రీలత, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **పగిడ్యాల :** తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు కండ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు సాజిదాబి, హైమావతి, భూషమ్మ, రామ లచ్చమ్మ, అనుషమ్మ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న అంగన్వాడీల దీక్షలు 36వ రోజుకు చేరుకున్నాయి. అంగన్వాడి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, గాంధీ , పెద్దక్క, శాంతమ్మ , సుధామని, భారతి, లక్ష్మీదేవి తదితరులు మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు బాల వెంకట్, తాలూకా కార్యదర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు సోమ, మంగళ వారాల్లో సంక్రాంతి పండుగను జరపకుండా శిబిరాల వద్దనే నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, వరలక్ష్మి, మల్లేశ్వరి, తులసి, పద్మ, సుకన్య, సుమలత, చంద్రకళ, మహేశ్వరి, శశికళ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో సంతకాల సేకరణతో నిరసన - యుటిఎఫ్, జెవివి సంఘీభావం

డోన్ : డోన్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్వాడీలు జగనన్నకు చెబుదాం కోటి సంతకాలతో అంటూ సంతకాల సేకరణ కార్యక్రమం సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం అధ్యక్షతన నిర్వహించారు. డోన్, ప్యాపిలి, క్రిష్ణగిరి మండలాల యుటిఎఫ్ నాయకులు సమ్మెకు సంఘీభావం ప్రకటించి మద్దతుగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు ఎన్.నరసింహుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి, యుటిఎఫ్ రాష్ట్ర ఆడిటింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు ఎన్ఎస్.బాబు, జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు, డోన్, ప్యాపిలి, క్రిష్ణగిరి మండల నాయకులు గోపాల్, సర్వజ్ఞ మూర్తి, శంషాద్ బేగం, సుమన్ మనోహర్, రమేష్ నాయుడు, రామమూర్తి, శివశంకర్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు రహమద్బి, సుమలత, ఆదిలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాములపాడులో సహాయ నిధి నిర్వహిస్తున్న అంగన్వాడీలు

డోన్‌లో సంతకాల సేకరణ చేపడుతున్న అంగన్‌వాడీలు

మహానందిలో..

ఆత్మకూరులో కళ్లకు గంతలు కట్టుకుని అంగన్‌వాడీల నిరసన

బండి ఆత్మకూర్‌లో పచ్చి గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నందికొట్కూరులో...

బనగానపల్లెలో గాంధీ విగ్రహానికి వినతి అందజేస్తూ...

ఆళ్లగడ్డలో...